## మహిళలు, పిల్లల భద్రతపై రాజీ లేదు

❖ 'సంస్కార్' మెగా కౌన్సెలింగ్‌లో మల్కాజ్‌గిరి సీపీ బి. సుమతి



**దశ, మల్కాజ్‌గిరి:** మహిళలు, పిల్లలపై వేధింపులు, గృహ హింస, బాలలపై నేరాలను ఏమాత్రం సహించబోమని మల్కాజ్‌గిరి సీపీ బి. సుమతి, ఐపీఎస్ హెచ్చరించారు. షీ టీమ్స్‌కు చిక్కిన నిందితుల్లో ప్రవర్తనా మార్పు తీసుకురావడమే లక్ష్యంగా 'మనోజాగృతి' సంస్థ సహకారంతో "సంస్కార్ మెగా కౌన్సెలింగ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ బి. సుమతి మాట్లాడుతూ, షీ టీమ్స్ ఉద్దేశం కేవలం శిక్షించడం మాత్రమే కాకుండా, తప్పు చేసిన వారిలో బాధ్యతాయుతమైన మార్పు తీసుకురావడమని తెలిపారు. మహిళల భద్రత, సైబర్ సేఫ్టీ, పోక్సో చట్టంపై ఇప్పటివరకు 406 అవగాహన కార్యక్రమాల ద్వారా 53 వేల మందికి చైతన్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ డీసీపీ డాక్టర్ బి. అనురాధ, మహిళా భద్రత డీసీపీ టి. ఉషారాణి, అడిషనల్ డీసీపీ బి. కోటేశ్వర్ రావు, షీ టీమ్స్ ఏసీపీ పి. వెంకటేశ్వర్లు, సైకాలజిస్ట్ గీతా చల్లా, లీగల్ అడ్వైజర్ కృష్ణమోహన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా జీ రాజు బాధ్యతల స్వీకరణ



**దశ, పెద్ద అంబర్ పేట :** పెద్ద అంబర్‌పేట్ కార్యాలయంలో నాగోల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా జీ రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం జీ రాజు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అలాగే కార్యాలయ పరిధిలో పారిశుధ్యం, మౌలిక వసతులు, ప్రజా సేవల మెరుగుదలకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు కార్యాలయానికి వచ్చే సమయంలో ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** అబ్దుల్లాపూర్‌మెట్ మండల రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పల్లవి తెలిపారు. అవసరమైన రైతులు బాటసింగారం PACS బ్యాంకును సంప్రదించి ఎరువులను పొందవచ్చని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి.రాజుకు సన్మానం



**దశ, పెద్ద అంబర్పేట్ :** నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.రాజును తెలంగాణ ఎల్‌టిపిఎస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అంబం లింగయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అంబం లింగయ్య, జి.రాజును శాలువాతో సన్మానం చేసి, కొత్త బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## తడిసిన ధాన్యానికి రైతులు అధైర్యపడొద్దు



**దశ, వీపనగండ్ల:** అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి వీపనగండ్ల మండల కేంద్రం, కేతేపల్లి శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత ఉందన్న రైతుల ఫిర్యాదుపై మంత్రి తక్షణమే స్పందించారు. జిల్లాలో ఇసుక రవాణాకు, ఫ్యాక్టరీల పనులకు వాడుతున్న లారీలను కూడా ధాన్యం తరలింపునకు మళ్లించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వీపనగండ్ల, పానగల్ కేంద్రాల నుంచి తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ మిల్లులకు తరలించాలని సూచించారు. కేతేపల్లి వద్ద కొనుగోలు ప్రక్రియలో జాప్యంపై మంత్రి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. అనంతరం మెహ్రూన్ ఇండస్ట్రీస్‌ను సందర్శించిన ఆయన, అన్‌లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించి మిల్లర్లు రైతులకు అండగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, తాసిల్దార్ ఖాజామైనుద్దీన్, సర్పంచ్ మీసాల పార్వతమ్మ, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ ప్రారంభం





❖ ఈ కార్యక్రమంలో మొత్తం 720 మంది మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

❖ స్వదేశీ కుక్క పిల్లల దత్తత కార్యక్రమానికి శ్రీకారం.



**దశ, నల్లగొండ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల యాక్షన్ ప్లాన్'లో భాగంగా ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం మే 29 నుంచి జూన్ 3 వరకు నగరంలోని అన్ని డివిజన్లలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చీరల పంపిణీతో మహిళలకు ప్రయోజనం కలగడమే కాకుండా సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి మహిళకు పారదర్శకంగా చీరలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అనంతరం స్వదేశీ (ఇండీ) కుక్క పిల్లల దత్తత కార్యక్రమాన్ని ప్రారంభించారు. దత్తత తీసుకునే వారు కుక్క పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి ఆరోగ్యం, పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి కార్పొరేటర్లు, వార్డ్ అధికారుల సమన్వయంతో చీరల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ PACS చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కార్పొరేటర్లు ఆలకుంట్ల నాగరాజు, మామిడి కార్తీక్, పెరిక స్వాతి, గోగుల గణేష్, అల్లి సుభాష్ చంద్రబోస్, గుండెబోయిన పుష్పలత, కేసాని వేణుగోపాల్ రెడ్డి, అల్లి నాగలక్ష్మి మల్లికార్జున్, మేప్మా టీఎంసీ శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు అనిల్ కుమార్, జ్యోతి, రాజా, నరసింహ, ఆర్‌పీలు, మహిళా సంఘ సభ్యులు, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మొత్తం 720 మంది మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నాని ప్రైవేట్ థియేటర్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది.

**దశ సూర్యాపేట ప్రతినిధి :** పెళ్లి రోజు, పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించడానికి మిని ఎసి థియేటర్ ను ఏర్పాటు చేయడం హర్షణీయమని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం నాడు సూర్యాపేట పట్టణంలో కుడకుడ జడ్పీ హైస్కూల్ ఎదురుగా నాని ఎసి ప్రైవేట్ థియేటర్ మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోగుపర్తి శివ సాయి ఆధ్వర్యంలో ఎసి మిని ప్రైవేటు థియేటర్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఎసి హోమ్ థియేటర్ చిన్న చిన్న ఫంక్షన్ లు చేసుకోవడానికి చాలా అనుకూలంగా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్, ఇండేన్ గ్యాస్ యజమాని తోట శ్యామ్ ప్రసాద్ కమల దంపతులు, సుధాబ్యాంకు వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్, ఎండి పెద్దిరెడ్డి గణేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ శ్రీనివాస్ ,జూలకంటి నాగరాజు, డోకుపర్తి ప్రవీణ్, డోగుపర్తి మల్లేష్ ,సాయి తేజ రాచూరు సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## యువత వ్యాపార రంగంలోకి రావాలి. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి




❖ ఎస్సీ, ఎస్టీ హబ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురు చూడకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ,ఎస్టీ వ్యాపారవేత్తల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే యువత పారిశ్రామిక రంగంలో రాణించాలని, రాష్ట్ర,దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో ముందుకు రావాలని కోరారు. వ్యాపార కేంద్రాలు, పరిశ్రమలు ఎలా ఏర్పాటు చేసుకోవాలి, వ్యాపార నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటనే అంశాలపై చాలా మంది యువతకు సరైన అవగాహన లేదని పేర్కొన్నారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేయడంలో మిక్కి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. నిబద్ధత, కృషి, సంకల్పం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని యువతకు సందేశం ఇచ్చారు. ఈ సదస్సులో మాదిగ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షులు తక్కెళ్ళ విప్లవగాంధీ, ఎన్‌ఎస్‌ఎస్ హెచ్‌ఓ ఇంచార్జి ఎస్. సురేష్, ఎన్‌ఎండిసి డిజిఎం హరి కిషన్,డిఐసి అడిషనల్ డైరెక్టర్ శోభారాణి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, ప్రచార కార్యదర్శి ఉమాపతి, కోశాధికారి శ్రీనివాస రాజు, జిల్లా సమన్వయ కర్త పడిదల శంకర్, డైరెక్టర్ దుబ్బా నాగేశ్వర్, మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, నాగేంద్ర గౌడ్, రవివర్మ, పడిదల జానకిరామ్, నమోనా గ్లోబల్ వెంచర్ ఫౌండర్ బొడ్డు రిషి, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# జీవో 17కు వ్యతిరేకంగా గళమెత్తుదాం

❖ ధర్నాను విజయవంతం చేయండి: జేఏసీ పిలుపు




**దశ, కల్వకుర్తి:** తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఇవాళ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ కారంగి బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, రిజర్వేషన్ల పరిరక్షణ మరియు సమాన అవకాశాల కోసం లక్షలాది మంది గొంతుకలై తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 17 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని బ్రహ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వారి కడుపు కొట్టిన ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని, ఆకలి మంటలతో అల్లాడుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ అన్యాయాన్ని ఎదిరించాలని కోరారు. జీవో 17ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భారీ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరుకానున్నారు. మన హక్కులను దోచుకుంటున్న అవినీతిపరులను తరిమికొట్టడానికి ఇదే సరైన సమయమని, సమాజంలో వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బడుగు బలహీన వర్గాల ఆవేదనను ప్రభుత్వానికి వినిపించేలా, లక్షలాది మందితో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ఈ నిరసనను విజయవంతం చేయాలని బ్రహ్మయ్య కోరారు.

జేఏసీ నాయకులు, కార్యకర్తలు, సామాజిక శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మన బతుకుల పరిరక్షణ కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం గోవిందాపురం గ్రామంలో నిన్నటి గాలి దుమారానికి ఇంటి రేకులు పగిలిపోయిన ఇంటిని శుక్రవారం పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అస్తవ్యస్తంగా మారిన రాము నివాసాన్ని పరిశీలించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాధిత కుటుంబానికి ఆయన ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పినపాక మాజీ ఎంపీటీసీ సత్యం, BRS గ్రామ కమిటీ అధ్యక్షులు బడే సాగర్, దిలీప్, రామటెంకీ నర్సింహారావు, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి గ్రామంలో వెలిసిన ఆణిముత్యం కుంజా భవాని

❖ *భద్రాచలం COE కళాశాల విద్యార్థినికి ఘన సన్మానం*



**దశ, మణుగూరు:** మణుగూరు మండలంలోని మారుమూల ఆదివాసి గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థిని కుంజ భవాని అందరికీ ఆదర్శంగా నిలిచింది. బుగ్గ పంచాయతీ పరిధిలోని కుంజ లక్ష్మయ్య-కౌసల్య దంపతుల కుమార్తె కుంజ భవాని భద్రాచలం COE కళాశాలలో బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో 440 మార్కులకు గాను 438 మార్కులు సాధించి తెలంగాణ స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. శుక్రవారం స్థానిక రాజు కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ సొసైటీలో కుంజ భవానిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ పాల్గొని విద్యార్థినిని అభినందించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మారుమూల ఆదివాసి గ్రామం నుంచి ఒక విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం గ్రామానికే గర్వకారణమని అన్నారు. కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని, నేటి సమాజంలో చదువుకంటే గొప్ప ఆయుధం మరొకటి లేదని పేర్కొన్నారు. "ఒక కోటీశ్వరుడు వంద మంది కోటీశ్వరులను తయారు చేయలేడు. కానీ ఒక విద్యావంతుడు వంద మంది విద్యవంతుల్ని తయారు చేయగలడు ఒక విద్యావంతుడు సంపాదించిన జ్ఞానాన్ని ఎవరూ దోచుకోలేరు. విద్యే మనిషికి శాశ్వత సంపద" అని ఆమె అన్నారు. కుంజ భవాని సాధించిన ఈ అరుదైన విజయం ఆదివాసి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతుందని, మరింత మంది ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పలువురు అభిప్రాయపడ్డారు.

# పేదల వైద్యం పట్ల నిర్లక్ష్యం వీడాలి


*భద్రాచలం ఏరియా ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలి: సీపీఎం డిమాండ్*



**దశ, భద్రాచలం:** ఏజెన్సీ ప్రాంతంలోని పేద ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వాల్సిన భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలని, తక్షణమే దీనిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలపై శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులు, సిబ్బందితో మాట్లాడి ఇక్కడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సర్వే అనంతరం ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రజలకు ఈ ఆసుపత్రి ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం 42 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, కేవలం 20 మందితోనే నెట్టుకొస్తున్నారని మండిపడ్డారు. నిత్యం 400 మందికి పైగా ఓపీ వస్తుండటంతో వైద్యులపై విపరీతమైన పని ఒత్తిడి పెరుగుతోందని, అందుకే ఇక్కడ పనిచేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని ఆరోపించారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు, నియోజకవర్గానికి డాక్టర్ అయిన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నా పరిస్థితి మారకపోవడం దారుణమన్నారు. పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ..ప్రమాదాల బారిన పడి అత్యవసర స్థితిలో వచ్చే వారికి చికిత్స అందించేందుకు ఇక్కడ 'న్యూరో సర్జన్' వంటి నిపుణులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న ఆసుపత్రి, నేడు పాలకుల నిర్లక్ష్యం వల్ల దయనీయ స్థితికి చేరిందని విమర్శించారు. తక్షణమే ఇక్కడ 'అడ్వాన్స్‌డ్ ట్రామా సెంటర్' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు తెచ్చేవారిని ఉపేక్షించేది లేదు

❖ *పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామనాథం*




**దశ, పినపాక:** కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పుకొని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవహరిస్తూ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనాథం స్పష్టం చేశారు. ఇటీవల కొన్ని పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశాలపై ప్రచారంలోకి వచ్చిన వార్తలపై పార్టీ అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించిందని తెలిపారు. ఆ విషయాలపై సమగ్ర విచారణ అనంతరం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.పార్టీ పేరు చెప్పుకొని ఎవరైనా ప్రజలను, అధికారులను లేదా కార్యకర్తలను బెదిరించే ప్రయత్నాలు చేస్తే అలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక వ్యవస్థ, క్రమశిక్షణ మరియు నియమ నిబంధనలు ఉన్నాయని, వాటికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొంతమంది వ్యక్తులు తమను తాము మండల అధ్యక్షులుగా ప్రచారం చేసుకోవడం, పత్రికల్లో వార్తలు రాయించుకోవడం జరుగుతోందని, ఇది పార్టీ విధానాలకు వ్యతిరేకమని రామనాథం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించిన 17 నామినేషన్లలో ఎంపికైన వారే మండల అధ్యక్షులుగా గుర్తింపు పొందారని స్పష్టం చేశారు. అధిష్టానం నిర్ణయించిన నాయకత్వాన్ని ప్రతి కార్యకర్త గౌరవించాలని సూచించారు. గతంలో పార్టీ కార్యాలయానికి తాళం వేసిన వారే పార్టీకి మొత్తం మేమే అని చెప్పుకునే పరిస్థితి ఉంటుందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాంగ్రెస్ నాయకుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. వ్యక్తిగత ప్రచారం కోసం పార్టీ పేరును దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ క్రమశిక్షణతో పనిచేసి పార్టీ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ జిల్లా సెక్రెటరీ బోడ రమేష్ మండల ఉపాధ్యక్షులు కొంబత్తిని శ్రీను వాసరావు, భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, ఉప్పాక సర్పంచ్ బాబురావు, ఉప్పాక ఉపసర్పంచ్ కోడెం రామ్ మోహన్ రావు, సంపత్, మార్తా మనోజ్, నక్కల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కూలగొట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు



❖ *పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు*

**దశ, మణుగూరు :** కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్ కూలిందని ఎంక్వయిరీ కమిషన్ వేశారని ఏదో ఒంకతో కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం ఆయన మణుగూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కమీషన్‌లు వేసినా ఏమైందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుని కూలగొట్టాలని ఆలోచనతోనే యంత్రాల ద్వారా ఇసుకను తోడుతూ, రాత్రి వేళలో జిలిటిన్ స్టిక్స్ బాంబులు పెట్టి పేలుస్తున్నారన్నారు. అంతర్జాతీయంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై పేరు ప్రతిష్టలు సంపాదించిన కెసిఆర్‌పై కుట్రలు పన్నెందుకే కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద ఇసుక తవ్వకాలు చేస్తున్నారని రేగ కాంతారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే కాలేశ్వరం ప్రాజెక్టును సక్రమంగా వినియోగించాలని కోరారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, పాత కార్యకర్తలని ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందంటూ , రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని రేగా కాంతారావు జోస్యం చెప్పారు. పాత బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కారు ఎక్కేందుకు ఆహ్వానిస్తున్నామన్నారు.



# విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలి

❖ *ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ రమణమూర్తి*

**దశ, మణుగూరు:** పాలీసెట్-2026 కౌన్సిలింగ్ కార్యక్రమం 29 మే 2026 నుండి 01 జూన్ 2026 వరకు గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్, మణుగూరులో నిర్వహించబడుతున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మరియు పాలీసెట్-2026 కోఆర్డినేటర్ శ్రీ పి.వి.వి. రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పాలీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరై సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. అలాగే కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకుని రావాలని తెలిపారు. 29 మే 2026 నాటికి మొత్తం 57 మంది విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ విజయవంతంగా పూర్తైనట్లు వెల్లడించారు. మనుగూరు మరియు పరిసర మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్, మనుగూరులో నిర్వహిస్తున్న పాలీసెట్-2026 కౌన్సిలింగ్‌లో పాల్గొని తమ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మరియు పాలీసెట్-2026 కోఆర్డినేటర్ శ్రీ పి.వి.వి. రమణమూర్తి గారు కోరారు.

# వాసవి క్లబ్ సమక్షంలో ఉచిత మజ్జిగ పంపిణీ



**దశ, మణుగూరు:** మణుగూరు అంబేద్కర్ చౌరస్తా వద్ద దోస్పాటి వెంకటేశ్వరరావు దంపతుల వివాహ దినోత్సవ సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దోసపాటి వారి సేవలు కొనియాడారు. మణుగూరు ప్రాంతంలో దోసపాటి రంగారావు ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాల్లో నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ శ్యామ్, ప్రతినిధులు బండారు నరసింహారావు సుగ్గల సూర్యం తదితరులు పాల్గొన్నారు.



# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

❖ *సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి*

**దశ, మణుగూరు:** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మణుగూరులో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 15 నుంచి మే 25 వరకు 10 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. 4 విడతలుగా పెట్రోల్ పై 7 రూపాయల 38 పైసలు, డీజిల్ పై 7 రూపాయల 52 పైసలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజల పై మోయలేని భారాలు మోపిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వలన రవాణా చార్జీలు పెరిగి నిత్యావసర సరుకుల ధరలు, ఇతర ధరలు పెరిగి సామాన్యులు జీవించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెల్లా అశోక్, ఆకుల. సత్యనారాయణ, పి. సంజీవరెడ్డి, వంశీకృష్ణ, సతీష్ బాబు, జంపయ్య, సుధాకర్, పివి శ్రీనివాస్, చెట్టుపల్లి. నాగేశ్వరరావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.